
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
కృష్ణా జిల్లా వార్తలు
సోమవారం 8 జనవరి 2024





పిల్లల బాధ్యత పెద్దలదే

కవి, రచయిత, నటుడు తనికెళ్ల భరణి సూచన

ముగిసిన 34వ విజయవాడ పుస్తక మహోత్సవం

- 6లో..

రంగులవల్లికలు

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీలకు విశేష స్పందన

రంగులమయమైన పీబీ సిద్ధార్థ కాలేజీ మైదానం

మొదటి ముగ్గురు విజేతలకు బహుమతుల ప్రదానం

విజేతలకు కేశినేని ఫౌండేషన్ ద్వారా బహుమతులు

పదిమందికి కన్సొలేషన్



● 'ముగ్గు'రు విజేతలు



రంగులమయమైన పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ కాలేజీ మైదానం, ఎన్టీఆర్ కలెక్టర్ ఢిల్లీరావు నుంచి బహుమతులు అందుకుంటున్న ప్రథమ బహుమతి విజేత బి.ఉమాదేవి (వల్లమూడి), ద్వితీయ బహుమతి విజేత మచ్చా మాధవి (అయోధ్యనగర్), తృతీయ బహుమతి విజేత టి.జ్యోతి (నందిగామ)

ఆకాశంలో హరివిల్లులు క్యూ కట్టినట్టు... ఇంద్రధనస్సులోని రంగులన్నీ ఇలపై ఒలికినట్టు.. అప్పటివరకు ఖాళీగా కనిపించిన ప్రాంగణాల్లో కమనీయ దృశ్యాలు ఆవిష్కృతమయ్యాయి. తరుణులు తోటమాలులై నిమిషాల వ్యవధిలో గుబాళించే రంగుల పూదోటను సృష్టించారు. రంగుల వైభవాన్ని అంగరంగ వైభవంగా కళ్లకు కట్టారు. "ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు, పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు, రియల్ పార్టనర్స్ స్వర్గసీమ సుకేతన, లోకల్ పార్టనర్ కేశినేని ఫౌండేషన్" ఆధ్వర్యంలో నగరంలోని పీబీ సిద్దార్థ ఆర్ట్స్ కాలేజీలో ముత్యాల ముగ్గుల పోటీలు ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి మహిళలు, యువతులు ఈ పోటీలకు హాజరు కాగా, ముచ్చటగా తీర్చిదిద్దిన మొదటి ముగ్గురు మగువలు కలెక్టర్ ఢిల్లీరావు చేతులమీదుగా నగదు బహుమతులు అందుకున్నారు. 10 మందికి కన్సొలేషన్ బహుమతులు లభించాయి.



● అలుపెరగని అంగన్వాడీలు

తమ సమస్యల పరిష్కారానికి అంగన్వాడీలు అలుపెరగక పోరాడుతూనే ఉన్నారు. ఎస్మాకు కూడా భయపడేది లేదంటూ ముందుకు కదులుతున్నారు. ప్రభుత్వానికి సవాల్ విసురుతున్నారు. ఆదివారం 27వ రోజు కూడా పామర్రులో దీక్ష చేపట్టిన అంగన్వాడీలు వీరు.

ముగిసిన భవానీ దీక్షల విరమణ

ఘనంగా పూర్ణాహుతి

☛ శనివారం రాత్రి వరకూ 3.50 లక్షల మంది భక్తుల రాక

☛ 15 లక్షల లడ్డు ప్రసాదాల విక్రయం



పూర్ణాహుతిలో పాల్గొన్న ఈవో, చైర్మన్

వన్‌టౌన్, జనవరి 7 : ఇంద్రకీలాద్రిపై ఈనెల 3న ప్రారంభమైన భవానీ దీక్షల విరమణ మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. శనివారం రాత్రి వరకు 3.50 లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. రికార్డు స్థాయిలో 15 లక్షల లడ్డూ ప్రసాదాలను భక్తులు కొనుగోలు చేశారు. ఆదివారం ప్రముఖ ప్రవచకుడు చాగంటి కోటేశ్వరరావు దంపతులు దుర్గమ్మను దర్శించుకున్నారు.

ఘనంగా పూర్ణాహుతి

ఐదు రోజుల పాటు దీక్షగా సాగిన శతచండీయాగానికి ఆదివారం పూర్ణాహుతితో ముగింపు పలికారు. లోకక్షేమం, శాంతిని కాంక్షిస్తూ ఈ యాగం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో ఈవో రామారావు, ట్రస్టుబోర్డు చైర్మన్ రాంబాబు దంపతులు, అర్చకులు, వైదిక సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈవో రామరావు మాట్లాడుతూ దేవదాయ శాఖ మంత్రి, ఉన్నతాధికారులు, స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్, జిల్లా యంత్రాంగం, పోలీసులు, దేవస్థానం సిబ్బంది అందరూ ఈ కార్యక్రమాల విజయానికి కృషి చేశారన్నారు. అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

వెల్లువలా కదిలారు

రా.. కదలిరా సభతో జనహోరైన తిరువూరు

తిరువూరు తిరునాళ్లను తలపించింది. టీడీపీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 'రా కదలిరా..' కార్యక్రమంతో జనహోరై మార్మోగింది. పసుపు జెండాల రెపరెపలతో పసిడి కాంతులను పులుముకుంది. ఏపీ నుంచే కాకుండా సరిహద్దున ఉన్న తెలంగాణ నుంచీ గ్రామాలకు గ్రామాలు కదలిరాగా, అధినేత చంద్రబాబు ఉత్తేజపూరిత ప్రసంగం కార్యకర్తల్లో నూతనోత్సాహాన్ని నింపింది. ప్రభుత్వ పెద్దలు, అధికార పార్టీ నాయకుల అవినీతిని ప్రశ్నిస్తూ, తిరువూరుకు వరాల జల్లు కురిపిస్తూ చంద్రబాబు చేసిన ప్రసంగంతో సభా ప్రాంగణంలోని కార్యకర్తలంతా చిందులేశారు.



తిరువూరు సభకు అశేషంగా హాజరైన జనాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబు

- ఏపీ నుంచే కాకుండా తెలంగాణ నుంచీ రాక
- కదిలివచ్చిన గ్రామాలకు గ్రామాలు
- ఉత్సాహాన్ని నింపిన చంద్రబాబు ప్రసంగం
- స్టేజీ కింద కార్యకర్తల డ్యాన్సులు
- పులకించిపోయి విజయ చిహ్నన్ని చూపిన బాబు
- తిరువూరు ప్రాంతానికి వరాల జల్లు
- ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్, 'చింతలపూడి', కట్టలేరుకు హామీ
- అధికార పార్టీ నేతల అవినీతిపై ఆగ్రహం

విజయవాడ, ఆంధ్రజ్యోతి/తిరువూరు : తిరువూరులో ఆదివారం టీడీపీ నిర్వహించిన 'రా కదలిరా' సభ నేతలు, కార్యకర్తల్లో జోష్‌ను నింపింది. ఎన్టీఆర్ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. ఖమ్మం జిల్లాలోని గ్రామాల నుంచి కార్యకర్తలూ తరలారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు చంద్రబాబు హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో తిరువూరులోని సభా ప్రాంగణం వద్దకు చేరుకున్నారు. అప్పటికే సభా వేదిక ముందున్న కుర్చీలన్నీ నిండిపోయాయి. ప్రాంగణం నుంచి ప్రధాన రహదారి వరకు ఉన్న ప్రాంతమంతా కార్యకర్తలతో కిక్కిరిసిపోయింది. సుమారు 35 వేల నుంచి 40 వేల మంది వరకు సభకు వచ్చి ఉంటారని అంచనా. ముఖ్యంగా తిరువూరుతో పాటు నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం నియోజకవర్గాల నుంచి కార్యకర్తలు భారీగా వచ్చారు. కార్యకర్తల్లో కనిపించిన ఉత్సాహాన్ని చూసి చంద్రబాబు పులకించిపోయారు. చంద్రబాబు అన్న ప్రతిమాటకు కార్యకర్తలు సై.. సై.. అంటూ నినాదాలు ఇచ్చారు. సభ ముగిసిన తర్వాత సైకో పోవాలి.. సైకిల్ రావాలి.. పాటను ప్లే చేయగా, కార్యకర్తలు డ్యాన్సులు చేశారు. వారి ఆనందాన్ని చూసిన చంద్రబాబు విక్టరీ సంకేతాన్ని చూపుతూ చిరునవ్వులు చిందించారు.

అధికార పార్టీ నేతలపై ఆగ్రహం

పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, సెంట్రల్ ఎమ్మెల్యే

- మిగతా 6లో

తిరువూరులో ప్రతి ప్రాంతాన్నీ సస్యశ్యామలం చేస్తానని చంద్రబాబు భరోసా ఇచ్చారు. అధికారంలోకి రాగానే చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని రూ.4,900 కోట్లతో పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ పథకం పూర్తయితే తిరువూరు, నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం, గన్నవరం, నూజివీడు నియోజకవర్గాలకు సాగునీరు అందించవచ్చన్నారు. అధికారంలోకి రాగానే ఈ పథకాన్ని పూర్తిచేయాలని సాగునీటి సంఘాల సమాఖ్య అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణ.. చంద్రబాబుకు వినతిపత్రం అందజేశారు. ముక్త్యాల ఎత్తిపోతల

వరాల జల్లు

పథకానికి వైఎస్సార్ ఎత్తిపోతల పథకంగా పేరు మార్చారన్నారు. రూ.4,100 కోట్లతో నిర్మించే ఈ పథకానికి ఇప్పటి వరకు కనీసం రూ.100 కూడా జగన్ ఖర్చు చేయలేదన్నారు. పిట్టలవారిగూడెంలో ఉన్న ఎత్తిపోతల పథకాన్ని రూ.6,900 కోట్లతో పూర్తి చేస్తామన్నారు. తిరువూరులో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. గంపలగూడెం మరో ఉద్యానంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గంపలగూడెం, ఎ.కొండూరులో ఉన్న ఫ్లోరైడ్ సమస్యను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కట్టలేరు వాగుపై వినగడప వద్ద రూ.29 కోట్లతో వారధిని నిర్మిస్తామన్నారు. దీనికి జగన్ హామీ ఇచ్చినా ఒక్క పని మొదలుపెట్టలేదని విమర్శించారు.

ఆలయ భూమి హాంఫట్!

అధికార పార్టీ నేతల భూ దందాకు అడ్డులేకుండా పోతోంది. జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో ఆలయ భూములను వదలడం లేదు. కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలోని సర్కారుతోటలో రాములవారి గుడి స్థలాన్ని ఆక్రమించి, చుట్టూ ప్రహరీ కట్టి భూమిని విక్రయించేందుకు బేరాలు పెడుతున్నారు. స్థానిక కార్పొరేటర్ సోదరుడి కనుసన్నల్లో రాములవారి గుడి స్థలం ఆక్రమించారు. ఇదే ప్రాంతంలో మసీదు స్థలాన్ని కబ్జా చేశారు. ఇక్కడ పక్కా భవనం నిర్మిస్తున్నారు. ఈ వ్యవహారంపై స్థానికులు రెవెన్యూ, మునిసిపల్ శాఖ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోకుండా మిన్న కుండిపోతున్నారు. సర్కారుతోట ప్రాంతంలో సెంటుభూమి కనీస ధర రూ.7.50 లక్షలు పలుకుతోంది.



మసీదు స్థలంలో పక్కా గృహ నిర్మాణం

సర్కారుతోటలో అధికార పార్టీ నాయకుల భూకబ్జా

» రాములోరి గుడి స్థలం ఆక్రమణ

» మసీదు స్థలంలో పక్కా భవన నిర్మాణం

» పట్టించుకోని రెవెన్యూ, మునిసిపల్ అధికారులు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : సర్కారుతోటలో 1975లో సర్వేచేసి ఇళ్ల స్థలాలకు నెంబర్లను కేటాయించారు. ఈ కాలనీలోని రామాలయానికి 28 సెంట్ల భూమి ఉండగా రాములవారి గుడిగానే రెవెన్యూ, మునిసిపల్ రికార్డుల్లో నమోదు చేశారు. రాములవారి గుడి రోడ్డులో ఇండస్ట్రియల్ ఎస్టేట్‌కు సమీపంలో సర్వే నెంబరు 357లో మసీదు స్థలం ఉన్నట్టు చూపి, రెవెన్యూ రికార్డుల్లో ఈ రెండు స్థలాలను సామాజిక అవసరాల కోసం కేటాయించిన భూమిగా చూపారు. రామాలయం పర్యవేక్షణను చూసే వ్యక్తి చనిపోవడంతో రామాలయంలో ధూపదీప నైవేద్యాలు నిలిచిపోయాయి. కాలక్రమంలో ఈ ఆలయం శిథిలావస్థకు చేరింది. దీంతో స్థానికులు ఈ ఆలయాన్ని పునర్నిర్మించారు. మిగిలిన భూమిపై ఇటీవల కాలంలో స్థానిక అధికార పార్టీ నాయకుల కన్ను పడింది. ఈ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించి కొంతభూమిని రోడ్డుగా చూపి గోడలు నిర్మించారు. తూర్పువైపున రెండు గేట్లు ఏర్పాటు చేశారు. రామాలయం స్థలాన్ని మూడు ప్లాట్లుగా విభజించి విక్రయించేందుకు రంగం చేస్తున్నారు. రామాలయానికి చెందిన స్థలం ఆక్రమించి విక్రయించేందుకు అధికార పార్టీ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారని, ఈ స్థలం సామాజిక అవసరాల కోసం కేటాయించినట్టుగా రికార్డుల్లో నమోదైనప్పటికీ ఆక్రమించేశారని స్థానికులు అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశారు. అయినా ఎవరూ పట్టించుకోలేదు. కాలనీలో రెండు అంగన్వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయని, సామాజిక అవసరాల కోసం కేటాయించిన ఈ భూమిలో అంగన్వాడీ కేంద్ర భవనాలు నిర్మించాలని స్థానికులు అధికారులకు వినతులిచ్చినా అవి బుట్టదాఖలయ్యాయి.

మసీదు స్థలంలో పక్కా భవన నిర్మాణం

సర్కారుతోటలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్ సమీపంలో 357 సర్వే నెంబరులో మసీదు స్థలం ఉంది. ఈ స్థలం 1975లో రెవెన్యూ రికార్డుల్లో మసీదు స్థలంగా నమోదు చేశారు. ఈ స్థలాన్ని ఆక్రమించేసి గతంలో పక్కాగృహ నిర్మాణం చేశారు. మిగిలిన స్థలంలో కొద్దిరోజులుగా పక్కాగృహ నిర్మాణాన్ని ప్రారంభించి పనులు చేస్తున్నారు. ఏడాది క్రితం మచిలీపట్నం డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) పాత రికార్డుల ఆధారంగా సర్వేచేసి గుడి, బడి, మసీదు, పార్కులు, ఇతర సామాజిక అవసరాల కోసం కేటాయించిన భూములను, స్థలాలను యథావిధిగా రికార్డుల్లో చూపారు. ఈ స్థలాలు భవిష్యత్తులో క్రయవిక్రయాలు చేయకుండా రెవెన్యూ రికార్డుల్లో రెడ్‌మార్కుతో చూపారు. కానీ, సర్కారుతోటలోని మసీదు స్థలానికి తప్పుడు పత్రాలు చూపి ఈ స్థలాన్ని అధికార పార్టీ నాయకులు ఆక్రమించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సామాజిక అవసరాల నిమిత్తం చూపిన భూమిలో పక్కాగృహం నిర్మిస్తున్నా మునిసిపల్ శాఖ అధికారులు కన్నెత్తి చూడకపోవడం అనుమానాలకు తావిస్తోంది. రెవెన్యూ, మునిసిపల్ అధికారులు ఈ రెండు స్థలాలపై విచారణచేసి వీటిని కబ్జాదారుల నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. అధికారులు స్పందించకుంటే న్యాయపోరాటం చేస్తామని కాలనీవాసులు చెబుతున్నారు.

రేపటి నుంచి కళాశాలలకు ఔటింగ్

భారీగా స్పెషల్ ఆపరేషన్‌కు ఆర్టీసీ సన్నాహాలు

● 9, 10, 11 తేదీల్లో 50 ప్రత్యేక బస్సులు

- 6లో..



విజయవాడ పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ కాలేజీలో 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీలో రంగవల్లులు దిద్దుతున్న మహిళలు



ప్రథమ బహుమతి పొందిన ముగ్గు



ద్వితీయ బహుమతి పొందిన ముగ్గు



తృతీయ బహుమతి పొందిన ముగ్గు



కన్సొలేషన్ బహుమతులు అందజేస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

రంగులవల్లికలు

- ధనుర్మాస ప్రాశస్త్యం తెలియజెప్పారు : కలెక్టర్ ఢిల్లీరావు
- ఘనంగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీలు
- ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు ఎంపిక
- పదిమందికి కన్సొలేషన్ బహుమతులు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ /భవానీపురం) : రంగ వల్లులు విజ్ఞాన జల్లులని.. వీటి వెనుక సైన్స్ దాగి ఉందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. ధనుర్మాస ప్రత్యేకత, సంక్రాంతి పర్వదిన విశేషాలను రంగవల్లులు ఆవిష్కరిస్తాయని తెలిపారు. ఆదివారం విజయవాడ పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ కాలేజీలో 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' నేతృత్వంలో ముత్యాల ముగ్గుల పోటీలు-2024 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ ఢిల్లీరావు మహిళలు వేసిన ముగ్గులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ముగ్గులు వేయటం ఒక కళ అని, ముగ్గు వెనుక సైన్స్ దాగి ఉందని చెప్పారు. సంక్రాంతి విశిష్టతను ముందు నుంచే తెలియచెప్పటంలో రంగవల్లుల పాత్ర ఎనలేనిదన్నారు. తొలితరం రోజుల్లో అడవులను నరికి ఇళ్లు నిర్మించుకునే క్రమంలో పేడతో అలికి.. ముగ్గులు వేయటం ఆనవాయితీగా ఉండేదని.. తదనంతరం ముగ్గు మన సంస్కృతిలో భాగమైందన్నారు. ముగ్గుల వెనుక శాస్త్రీయత దాగి ఉందన్నారు. పూర్వం సూక్ష్మక్రిములు ఇళ్లలోకి చేరకుండా ఉండేందుకు పేడతో అలికి, ముగ్గులు పెట్టేవారన్నారు. ముగ్గులు కళాత్మకతతో ఎన్నో అంశాలను వివరిస్తాయని కలెక్టర్ చెప్పారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలలో భాగమైన ముగ్గులకు ప్రాచుర్యం కల్పించేలా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' గత 15 సంవత్సరాలుగా పోటీలు నిర్వహించటం మంచి విషయమన్నారు. ఈ సందర్భంగా యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. ఇలాంటి ముగ్గుల పోటీలను మరిన్ని నిర్వహించాలన్నారు. ఏ చదువు లేని వారు కూడా గొప్పగా థీమ్‌లను ప్రదర్శించటం గొప్ప విషయమన్నారు. న్యాయనిర్ణేత అబ్బూరి రత్నలక్ష్మి మాట్లాడుతూ, ఆడవాళ్లకే సాధ్యమైన ఈ కళ వారి భావాలను ముగ్గుల ద్వారా ప్రదర్శించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో న్యాయాధికారి సీతామహలక్ష్మీ (మహిత), ఆంధ్రజ్యోతి విజయవాడ యూనిట్ బ్రాంచి మేనేజర్ వి.మురళీ, ఎడిషన్ ఇన్‌చార్జి ఎ.ఉమామహేశ్వరరావు, బ్యూరో ఇన్‌చార్జి పి.మృత్యుంజయకుమార్, కనకదుర్గా ఫైనాన్స్ ఎండీ సందిరెడ్డి లక్ష్మీనారాయణ, ఏపీ స్టేట్ బ్యూరో చీఫ్ మాధవ్, ఏజీఎం టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జిల్లా విజేతలు వీరే..

'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీల్లో ఎన్టీఆర్ జిల్లా నుంచి బి.ఉమాదేవి (వడ్లమూడి) ప్రథమ, మచ్చా మాధవి(అయోధ్యనగర్) ద్వితీయ, టి.జ్యోతి (నందిగామ) తృతీయ స్థానాలు సాధించారు. కేశినేని ఫౌండేషన్ తరఫున రూ.6000, రూ.4000, రూ.3000 నగదు బహుమతులను కలెక్టర్ ఢిల్లీరావు విజేతలకు అందజేశారు. అలాగే 10 మందికి కన్సొలేషన్ బహుమతులతో పాటు పోటీల్లో పాల్గొన్న ప్రతి మహిళకు చిరుకానుకగా చీరలను అందజేశారు. ముగ్గుల పోటీలకు ప్రధాన స్పాన్సర్‌గా కేశినేని ఫౌండేషన్ తరఫున కేశినేని శివనాథ్ (చిన్ని) సహకారాన్ని అందించారు.

పదేళ్లుగా పోటీల్లో పాల్గొంటున్నా..

- డి.ఉమాదేవి, ప్రథమ బహుమతి విజేత

పదేళ్లుగా 'ఆంధ్రజ్యోతి-ముత్యాల ముగ్గులు' పోటీల్లో పాల్గొంటున్నా. సృజనాత్మకంగా వేస్తేనే విజయం వరిస్తుంది. అందుకే ఈసారి ఎంతో కష్టపడి సంక్రాంతిని ప్రతిబింబించేలా అనుకున్నట్టుగా వేయగలిగాను. మొదటి స్థానం సాధించటం ఆనందంగా ఉంది.

కష్టమైనా.. విజయం వరించింది

- మచ్చా మాధవి, ద్వితీయ బహుమతి విజేత

2017లో రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం సాధించా. ఈసారి ధనుర్మాసంలో తెలుగు ప్రజలకు అత్యంత పెద్ద పండుగ సంక్రాంతిని ప్రతిబింబించేలా కష్టమైన చుక్కల ముగ్గు వేశా. ద్వితీయ స్థానం సాధించటం ఆనందంగా ఉంది. ప్రతీఏడాది ముగ్గుల పోటీల్లో పాల్గొంటాను.

ఆనందంగా ఉంది

- తోటకూర జ్యోతి, తృతీయ బహుమతి విజేత

ముత్యాల ముగ్గుల పోటీలలో ప్రతీ ఏడాది పాల్గొంటాను. సంక్రాంతి శోభను ఇనుమడించేలా ముగ్గును వేశాను. తృతీయ స్థానం దక్కటం ఆనందంగా ఉంది.

చివరిశ్వాస వరకు నియోజకవర్గానికి కాపు కాస్తా

- ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని)



నీటి ట్యాంకర్లను అందజేస్తున్న నాని

వన్‌టౌన్, జనవరి 7 : విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గానికి చివరి శ్వాస వరకు కాపుకాస్తా అని విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) అన్నారు. కేశినేని భవన్‌లో ఆదివారం రెడ్డిగూడెం, జి.కొండూరు మండలాలలోని 19 గ్రామాలకు తన ఎంపీ నిధులనుంచి ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకర్లను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, ఒక ప్రజాప్రతినిధిగా పనిచేసుకుంటూ వెళ్లడమే తన లక్ష్యమన్నారు. విజయవాడ ప్రజలు తనకు అందించిన సహకారాన్ని మరువలేనని, చివరికంటా కాపుకాస్తానని పేర్కొన్నారు.

కార్యాలయంపై టీడీపీ జెండాల తొలగింపు

ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) విజయవాడలోని తన కార్యాలయం కేశినేని భవన్‌పై టీడీపీ జెండాలను తొలగించారు. తిరువూరు సభ ఏర్పాట్లలో చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆయన తన ఎంపీ పదవికి, టీడీపీకి కూడా రాజీనామా చేయనున్నట్టు ప్రకటించారు. శనివారం సాయంత్రమే కార్యాలయంపై టీడీపీ జెండాలను తొలగించారు. ఆదివారం మీడియాతో మాట్లాడుతూ, తిరువూరు సభకు తాను వెళ్లక పోయినా ఎంపీగా ప్రొటోకాల్ ఇచ్చామని చెప్పుకోవడం కోసం వేదికపై సీటు ఏర్పాటు చేసి ఉంటారన్నారు. అదే విధంగా బ్యానర్లూ కట్టి ఉంటారని ముక్తాయించారు. గతంలో ప్రొటోకాల్ పాటించలేదని, ఇప్పుడు ఆ పొరపాటును సరిదిద్దుకోవడానికి అలాచేసి ఉంటారన్నారు, అయినా తాను పార్టీకి రాజీనామా చేస్తున్నానని చెప్పిన తరువాత ఇంక వాళ్లు అనుసరించాల్సింది ఏముంటుందన్నారు. సాంకేతికంగా కొంత ఆలస్యం తప్ప తాను రాజీనామా చేస్తానని స్పష్టం చేశారు. కార్యాలయంపై జెండాలను ఇప్పటికే తీసివేశానని, బోర్డులను తీయాల్సి ఉందని తెలిపారు.

పసుపు సంద్రంగా తిరువూరు



చంద్రబాబు బహిరంగ సభకు భారీగా హాజరైన మహిళలు

తిరువూరు, జనవరి 7 : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు 'రా కదలిరా' సభకు వేలాదిగా ప్రజలు పసుపు జెండాలతో తరలిరావడంతో పట్టణం పసుపు సంద్రంగా మారింది. అయ్యప్పస్వామి ఆలయ సమీపంలో 20 ఎకరాల్లోని సభ ప్రాంగణంతో పాటుగా, విజయవాడ-జగదల్‌పూర్ ప్రధాన రహదారి ఆదివారం పసుపు సైన్యంతో కిటకిటలాడింది. నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాలు, గ్రామాలకు చెందిన అభిమానులు, పార్టీ శ్రేణులు ఉదయమే సభప్రాంగణానికి చేరుకున్నారు. సభలో పాల్గొనేందుకు దివ్యాంగులు, మహిళలు పసి పిల్లలతో రాగా సమీపంలోని భవనాలపైకి చేరి తమ నాయకుడ్ని చూసేందుకు ఉత్సాహం చూపారు. ఉదయం పట్టణంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. చంద్రబాబు ప్రసంగం కొనసాగుతున్నంత సేపూ జనం తండోపతండాలుగా తరలివస్తుండటం గమనార్హం. చంద్రన్నకు జై, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు జై అంటు నినాదాలతో హోరెత్తించారు.

బెజవాడను గంజాయి కేంద్రంగా మార్చారు

- బొండా ఉమామహేశ్వరరావు

రాజకీయ రాజధాని బెజవాడను వైసీపీ పాలకులు గంజాయి కేంద్రంగా మార్చారని, విజయవాడ అభివృద్ధి పూర్తిగా విస్మరించారని విజయవాడ సెంట్రల్ మాజీ ఎమ్మెల్యే, పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు విమర్శించారు. బహిరంగ సభలో అయన మాట్లాడుతూ, ప్రజలపై ఆర్థిక భారాలు మోపుతూ రాష్ట్రం కోసం అప్పులు తెస్తున్నామని ఆ నిధుల్ని తన సొంత ఖజానాకు మళ్లిస్తున్నారని ఆరోపించారు. మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, సాగుకు ప్రాణాధారమైన సాగునీటి ప్రాజెక్టులను సైకో జగన్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. అవినీతి సొమ్మును విదేశాలకు కంటైనర్లద్వారా తరలిస్తున్నారని ఆరోపించారు. ఉమ్మడి కృష్ణాజిల్లా జనసేన అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ, పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి పోతిన మహేష్, మనుబోలు శ్రీనివాసరావులు మాట్లాడుతూ, టీడీపీ జనసేన పొత్తు ప్రజాసంక్షేమం కోసమే అన్నారు. రాష్ట్రంలో అవినీతి పాలనను సాగనంపేందుకు జనసేన, టీడీపీ పొత్తుతో తాడేపల్లి ప్యాలెస్ వణికిపోతోందన్నారు. ప్రజాసంక్షేమం, రాష్ట్ర భవితవ్యం కోసం టీడీపీ, జనసైనికులు సంఘటితంగా కృషి చేయాలని కోరారు. సభలో మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు, కేశినేని చిన్ని, బుద్ద వెంకన్న, ఎమ్మెల్యే గద్దె రాంమోహన్‌రావు, సాయిగౌడ్, పట్టాభి, వర్ల రామయ్య, కొలికపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వెల్లువలా కదిలారు

(5వ పేజీ తరువాయి)

మల్లాది విష్ణు, నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు సోదరులు, జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభానుపై చంద్రబాబు నిప్పులు చెరిగారు. వాళ్లందరితో జగన్ తప్పులు చేయించారని ఆరోపించారు. వెలంపల్లిని కొబ్బరిచిప్పల మంత్రిగా అభివర్ణించారు. దేవదాయ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు దేవుడి ఆస్తులను హారతి కర్పూరంలా కరిగించేశాడని దుయ్యబట్టారు. పశ్చిమలో వేస్ట్‌గా ఉన్న వెలంపల్లి సెంట్రల్‌లో బెస్ట్ అయ్యాడా అని ప్రశ్నించారు. సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు కనిపించిన ఆస్తిని కొనేసే స్థాయికి వచ్చాడని విమర్శించారు. సెంట్రల్‌లో వేస్ట్ అని తేల్చడంతో మల్లాది చిరునామా లేకుండా పోయాడన్నారు. నందిగామ ఎమ్మెల్యే జగన్మోహనరావు ఓ దొంగ అని విమర్శించారు. ప్రతిదానికీ అన్నదమ్ములు జగన్మోహనరావు, అరుణకుమార్ మొండిపట్టు పడతారన్నారు. జగ్గయ్యపేట ఎమ్మెల్యే ఉదయభాను కుమారుడు డ్రగ్స్ కేసులో ఉన్నాడని ఆరోపించారు.

సభకు ఎంఎస్ బేగ్ హాజరు

పశ్చిమ నియోజకవర్గానికి చెందిన ఎంఎస్ బేగ్ సభకు హాజరయ్యారు. బేగ్.. ఎంపీ కేశినేని నాని వర్గీయుడిగా ఉన్నారు. పలు సందర్భాల్లో పశ్చిమ నుంచి టీడీపీ అభ్యర్థిగా బేగ్ పోటీ చేస్తారని, ఎంపీగా తాను పోటీ చేస్తానని నాని ప్రకటించారు. కొద్దిరోజులుగా జరిగిన పరిణామాలతో నాని సభకు దూరంగా ఉన్నా బేగ్ మాత్రం హాజరవడం గమనార్హం. సభలో తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు జలీల్‌ఖాన్, శ్రీరాం తాతయ్య, తంగిరాల సౌమ్య, బొండా ఉమామహేశ్వరరావు, మచిలీపట్నం జిల్లా కమిటీ అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ, ఎన్టీఆర్ జిల్లా కమిటీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం, గుడివాడ ఇన్‌చార్జి వెనిగండ్ల రాము, టీడీపీ నాయకులు కేశినేని చిన్ని, ఆలపాటి రాజేంద్రప్రసాద్, నక్కా ఆనందబాబు, కొల్లు రవీంద్ర, బుద్ధా వెంకన్న, నాగుల్‌మీరా, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, జనసేన కృష్ణాఅధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ నాని, మాజీ ఎమ్మెల్యే దూరం

తిరువూరు సభకు విజయవాడ ఎంపీ కేశినేని నాని, తిరువూరు మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాసు హాజరుకాలేదు. సభ కోసం సిద్ధం చేసిన వేదికపై ఎంపీ కేశినేని నానికి కుర్చీని వేశారు. దానిపై ఆయన పేరుతో స్టిక్కర్ అతికించారు. చంద్రబాబు కుర్చీ పక్కనే తిరువూరు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి శావల దేవదత్, ఆయన పక్కన ఎన్టీఆర్ జిల్లా పార్టీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం, అయన పక్కన ఎంపీ కేశినేని నానికి సీటు కేటాయించారు. ఆయన రాకపోవడంతో ఆ కుర్చీల్లో మరొకరు కూర్చున్నారు. నాని వర్గంలో ఉన్న మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాసు హాజరుకాకపోవడం చర్చనీయాంశంగా మారింది. సభా ప్రాంగణానికి ఉన్న రహదారులకు పక్కన ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో కొన్నింటిపై నాని ఫొటోలను ప్రచురించారు.

దేవినేని ఉమాకు వసంత నోటీసు


మైలవరం: పరువుకు భంగం కలిగించే విధంగా తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నాడని మాజీమంత్రి దేవినేని ఉమాకు మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పరువు నష్టం దావా వేస్తూ ఆదివారం లీగల్ నోటీస్ పంపారు. పరువు నష్టం కింద రూ.10 కోట్లు పరిహారం చెల్లించాలని నోటీస్ పంపారు. 2023 నవంబరులో జరిగిన ప్రెస్‌మీట్‌లో దేవినేని ఉమా తనపై చేసిన ఆరోపణలపై వసంత ఈ నోటీస్ పంపారు. ఇబ్రహీంపట్నం థర్మల్ పవర్ స్టేషన్ నుంచి వచ్చిన బూడిద అమ్ముకుంటున్నామని చేసిన ఆరోపణలు నిరూపించాలని నోటీస్‌లో న్యాయవాది కోరారు. ఆరోపణలు నిరూపించకపోతే క్రిమినల్‌డ్యామేజెస్ ఫైల్‌చేస్తామని వసంత పేర్కొన్నారు.


పిల్లల బాధ్యత పెద్దలదే

- పుస్తక మహోత్సవం ముగింపు సభలో

కవి, రచయిత, నటుడు తనికెళ్ల భరణి


ఇవాళ ప్రపంచంలో మొబైల్ వ్యాధిగ్రస్తులు కాకుండా పిల్లలను కాపాడుకునేందుకు పుస్తకాలను పరిచయం చేయాలి.. ఆ బాధ్యత పెద్దలే తీసుకోవాలి.. పుస్తకాలతో స్నేహం దీర్ఘకాలిక ఆనందాన్నిచ్చే శాశ్వత బంధం ఉంటుందని, చదువు పట్ల ఆసక్తి కలిగించేందుకు జీవిత చరిత్రలు చదవడం ఉపకరిస్తుందని చెప్పాలి





విజయవాడ కల్చరల్, జనవరి 7 : చూడటం నుంచి చదవడం వైపునకు పిల్లలను మళ్లించాల్సిన బాధ్యత పెద్దలకు వుందని కవి, రచయిత, నటుడు తనికెళ్ల భరణి అన్నారు. ఆదివారం 34వ విజయవాడ పుస్తక మహోత్సవం ముగింపు సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అయన మాట్లాడుతూ, మన పూర్వీకులు మనకు అపారమైన సాహిత్యనిధి ఇచ్చి వెళ్లారన్నారు. అక్షరం అంటే నాశనం లేనిది అని గుర్తు చేశారు. పుస్తకం ఒక పేజీ తీస్తే ప్రపంచానికి ఒక కొత్త కిటికీ తీసినట్టేనన్నారు. కొత్త తరానికి పుస్తకాలను, సాహిత్య విలువలను పరిచయం చేయడంలో పుస్తక మహోత్సవం పోషిస్తోన్న పాత్ర ఆనందదాయకమన్నారు. ఇవాళ ప్రపంచంలో మొబైల్ వ్యాధిగ్రస్తులు కాకుండా పిల్లలను కాపాడుకొనేందుకు పుస్తకాలను పరిచయం చేయాలన్నారు. పుస్తకాలతో స్నేహం దీర్ఘకాలిక ఆనందాన్నిచ్చే శాశ్వత బంధం అన్నారు. చదువు పట్ల ఆసక్తి కలిగించేందుకు జీవిత చరిత్రలు చదవడం ఉపకరిస్తుందన్నారు. 'అనుభవాలు-జ్ఞాపకాలు', 'నా జీవనయానం', 'హంపీ నుంచి హరప్పాదాకా' పుస్తకాలు చదవడం ద్వారా తెలుగునేల మూడు ప్రధాన భాగాల సాంస్కృతిక వైభవాన్ని తెలుసుకోవచ్చన్నారు. సాహిత్యం వ్యక్తులకు రసస్ఫూర్తినిచ్చే రోజుల నుంచి సామాన్యుల కష్టాలను ప్రతిఫలించే రోజులకు మారిందన్నారు. గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి కాంతిలాల్ మాట్లాడుతూ, పుస్తక ప్రచురణకు ప్రసిద్ధి చెందిన విజయవాడలో పుస్తక మహోత్సవం ఇంత ఘనంగా విజయవంతం కావడం సహజమే అయినా, ఈ రోజుల్లో ఇంతమంది పుస్తకాలు చదివేవాళ్లుండటం ఆనందదాయకమన్నారు. పుస్తకాలను జీవితంలో భాగం చేసుకొని శుభప్రదం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఐఏఎస్ అధికారి ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ పుస్తక మహోత్సవంలో విరివిగా పాల్గొనడం ఎంతో ఆనందాన్నిచ్చిందన్నారు. సంఘానికి అభినందనలు తెలిపారు. ఎమెస్కో విజయకుమార్ స్వాగతం పలికి సభను నిర్వహించారు. అధికారులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. పుస్తక మహోత్సవ సంఘం అధ్యక్షులు మనోహర్ నాయుడు ప్రజలకు, పుస్తక ప్రియులకు ధన్యావాదాలు తెలిపారు. ప్రతిభా వేదికపై వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. పుస్తక మహోత్సవ సంఘం గౌరవాధ్యక్షులు బెల్లపు బాబ్జీ, గోళ్ల నారాయణరావు సభలో పాల్గొన్నారు. కార్యదర్శి కె.లక్ష్మయ్య వందన సమర్పణ చేశారు.

యువకుడిపై కత్తితో దాడి




తీవ్ర గాయాలతో కరీం హుస్సేన్

నాగాయలంక, జనవరి 7 : యువతి ఇంటికి వచ్చిన యువకుడిపై తండ్రీకొడుకులు కలిసి దాడి చేసిన ఘటన ఆదివారం రాత్రి పెదపాలెంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని పెదపాలేనికి చెందిన యువతితో విజయవాడ భవానీపురానికి చెందిన కరీం హుస్సేన్‌కు గత రెండేళ్లుగా పరిచయాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో యువతిని చూసేందుకు కరీం హుస్సేన్ ఆదివారం పెదపాలెం వచ్చాడు. దీంతో యువతి తండ్రి బొడ్డు అర్జునరావు, అన్న నాగరాజు కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. క్షతగాత్రుడిని తొలుత అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రి తరలించారు. అనంతరం మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేయగా, అక్కడికి తీసుకెళ్లినట్లు ఎస్ఐ ఎం.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

తోట్లవల్లూరులో..



తోట్లవల్లూరు: తోట్లవల్లూరు స్టేషన్ వద్ద యువకుడిపై మరో వ్యక్తి కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఓ మహిళ వ్యవహారంలో ఏర్పడిన గొడవపై ఆదివారం సాయంత్రం స్టేషన్‌కు ఇరువర్గాలు వచ్చినపుడు ఒక వర్గం తెగబడింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తోట్లవల్లూరు శివారు అంబేడ్కర్‌నగర్‌కు చెందిన తెలుగు సుధాకర్(29)కు అదే గ్రామానికి చెందిన వ్యక్తి భార్యతో వివాహేతర సంబంధం నడుస్తోంది. ఆదివారం మధ్యాహ్నం ఇరువర్గాలు ఎదురు పడి కర్రలతో కొట్టుకున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసుకోవటంతో ఉయ్యూరు గాయపడిన వారిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మధ్యాహ్నం జరిగిన గొడవపై సేషన్‌లో పోలీసులు విచారిస్తుండగా అదేసమయంలో స్టేషన్‌కు వచ్చిన తెలుగు సుధాకర్ వీపుపై కత్తితో దాడిచేయడంతో బలమైన గాయాలయ్యాయి. దాడికి పాల్పడిన అనిల్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని సుధాకర్‌ను ఉయ్యూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం విజయవాడ తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పి.విశ్వనాథ్ తెలిపారు.



చలసాని వసుమతి జీవన సాఫల్య పురస్కారాలు ప్రదానం చేస్తున్న వసుమతి తదితరులు

చలసాని వసుమతి జీవన సాఫల్య పురస్కారాల ప్రదానం

విజయవాడ కల్చరల్, జనవరి 7 : ప్రసిద్ధ రచయిత్రి ఇంద్రగంటి జానకిబాల, ప్రసిద్ధ కథారచయిత ఎల్.ఆర్.స్వామిలు చలసాని వసుమతి జీవన సాఫల్య పురస్కారాలను అందుకున్నారు. రచయిత్రి వసుమతి స్వయంగా ప్రదానం చేశారు. ప్రముఖ సినీదర్శకులు శ్రీ ఇంద్రగంటి మోహనకృష్ణ, తన తల్లికి జీవనసాఫల్య పురస్కారం అందిస్తోన్న సభలో ఆమె పక్కనే కూర్చోవడం గొప్ప అనుభూతినిస్తోందన్నారు. విజయవాడలో తన బాల్య స్మృతులను అయన గుర్తు చేసుకున్నారు. రచయిత్రిగా తన ఎదుగుదల అంతా విజయవాడలోనే జరిగిందని, తానెంతో రుణపడి వున్నానని జానకిబాల అన్నారు. తెలుగు, మళయాళ సమాజాలలో భాషాపరమైన వైరుధ్యాల కారణంగా ఎదురయ్యే అనువాద సమస్యల గురించి వివరించారు. సభకు శ్రీ గుత్తికొండ సుబ్బారావు అధ్యక్షత వహించారు. డాక్టర్ జీవీ పూర్ణచందు సభను నిర్వహించారు. శ్రీ చలసాని రవి దంపతులు సన్మానాలు చేశారు.

రేపటి నుంచి కళాశాలలకు ఔటింగ్

- భారీగా స్పెషల్ ఆపరేషన్‌కు ఆర్టీసీ సన్నాహాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): సంక్రాంతి పర్వదినం నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా ఈ నెల 9వ తేదీ నుంచి కళాశాలలకు ఔటింగ్ ఇవ్వనుండటంతో ఆర్టీసీ అధికారులు భారీగా స్పెషల్ ఆపరేషన్‌కు శ్రీకారం చుట్టబోతున్నారు. ఎన్టీఆర్ జిల్లా నుంచి కళాశాల విద్యార్థుల కోసం ఈ నెల 9, 10 , 11 తేదీలలో 50 ప్రత్యేక బస్సుల చొప్పున నడపాలని నిర్ణయించారు. సంక్రాంతి ప్రయాణాలను ఎన్ 'క్యాష్' చేసుకునేందుకు రాయలసీమ జిల్లాలకు ఎక్కువగా నడపాలని నిర్ణయించారు. రాయలసీమ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున విద్యార్థులు విజయవాడ పరిసర ప్రాంతాలలోని కళాశాలలో చదువుకుంటున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ అధికారులు రాయలసీమ జిల్లాలకు ప్రత్యేకంగా బస్సులు నడపాలని నిర్ణయించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	85, 92, 102
చికెన్ విత్ స్కిన్	164
చికెన్ స్కిన్‌లెస్	174

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.65

రంగస్థల కళలను కాపాడుకోవాలి



కళాకారులను సత్కరిస్తున్న జంపాన

ఉయ్యూరు, జనవరి 7 : కనుమరుగవుతున్న రంగస్థల కళను కాపాడుకోవాలిసిన అవసరం ఉందని ఉయ్యూరు మాజీ చైర్మన్ జంపాన పూర్ణచంద్రరావు అన్నారు. స్థానిక నాగళ్ల రాజేశ్వరమ్మ, జానకిరా మయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం కరుణాకర కళాతోరణం ఆధ్వర్యంలో రంగస్థల కళాకారుల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పలువురు రంగ స్థల కళాకారులను సన్మానించారు. మురళి, వేమూరి బాబ్జి, నాంచారయ్య, శివనాగేంద్రం తదితరుల పాల్గొన్నారు.

అనుమోలు ట్రస్టు సేవలు ప్రశంసనీయం



మందులు పంపిణీ చేస్తున్న బోడె ప్రసాద్, అనుమోలు ప్రభాకరరావు

పెనమలూరు, జనవరి 7 : నిరుపేదలకు ఉచితంగా వైద్య సేవలందిస్తూ ప్రజల ప్రేమాభిమానాలు చూరగొంటున్న అనుమోలు ఆదరణ ఛారిటబుల్ ట్రస్టు సేవలు ప్రశంసనీయమని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం పోరంకి టీడీపీ కార్యాలయంలో జరిగిన అనుమోలు ఆదరణ ట్రస ఉచిత వైద్యశిబిరంలో ఆయన పాల్గొని స్థానికులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ప్రభుత్వం నుంచి నిరుపేదలకు వైద్య సేవలు కరువైన ప్రస్తుత తరుణంలో అనుమోలు ఛారిటబుల్ ట్రస్టు తరఫున చైర్మన్ అనుమోలు ప్రభాకరరావు చొరవ తీసుకొని వైద్య సేవలందించడం గొప్ప విషయమన్నారు. రెండు వందల మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కోలా ప్రసాద్, కంచర్ల రాధాకృష్ణ, అన్వర్ బేగ్, చింతా రాధాకృష్ణ, బొంగరాల అబ్రహాం, డాక్టర్ అనూష పాల్గొన్నారు.

గండిగుంట దత్త ఆశ్రమంలో..

ఉయ్యూరు : గండిగుంట దత్త ఆశ్రమంలో నిర్వహించిన ఉచిత హోమియో వైద్యశిబిరంలో 160 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ మేనేజింగ్ ట్రస్టీ మంజు, శిబిరం నిర్వాహకుడు పురుషోత్తమాచార్యులు మాట్లాడుతూ, గణపతి సచిదానందస్వామి ఆశీస్సులతో పది సంవత్సరాల నుంచి ప్రతినెల మొదటి ఆదివారం ఉచిత హోమి యో శిబిరం నిర్వహిస్తూ వేలాది మందికి ఉచితంగా వైద్యపరీక్షలు చేసి మందులు అందజేస్తున్నామన్నారు. హోమియో శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని వ్యాధుల నుంచి ఉపశమనం పొందాలని పీఆర్వో నారాయణమూర్తి కోరారు.

షార్ట్ సర్క్యూట్‌తో పాఠశాల రికార్డులు దగ్ధం



దగ్ధమైన రికార్డులు

గన్నవరం, జనవరి 7 : మండలంలోని సూరంపల్లి జడ్పీ హైస్కూల్‌లో పెనుప్రమాదం తప్పింది. ఆదివారం మధ్యాహ్న సమయంలో ఆఫీసు రూమ్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం సంభవించింది. ఆదివారం సెలవు కావటంతో ఎవరు లేరు. రూములో నుంచి మంటలు వ్యాపించటంతో స్థానికులు మంటలను గమనించి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందజేసి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. అప్పటికే పాఠశాలలోని పలు రికార్డులు, ల్యాప్‌ట్యాప్, టీవీ, ఫర్నీచర్ దగ్ధం అయ్యాయి. హెచ్ఎం హరిశరణ్ పాఠశాలకు వచ్చి ఆ గది తాళాలు తీశారు. అగ్ని మాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.

మహిళా సదస్సుకు సర్పంచ్ శ్రీదేవికి ఆహ్వానం

గుణదల, జనవరి 7: ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం ఈ నెల 9న నిర్వహించే జాతీయ మహిళా సదస్సుకు ఏపీ నుంచి రామవరప్పాడు సర్పంచ్ వరి శ్రీదేవి ఎంపికయ్యారు. ఈ మేరకు కేంద్ర మహిళా కమిషన్ నుంచి ఆమె ఆదివారం ఆహ్వానం అందుకున్నారు. మహిళలపై జరుగుతున్న దాడులు వాటిని ఎదుర్కోవడం ఎలా అనే అంశంపై తరచూ మండల, జిల్లా పరిషత్ పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించి గుర్తింపు పొందారు. ఏపీ నుంచి ప్రతినిధిగా వరి శ్రీదేవి ఒక్కరే ఎంపిక కావడం పట్ల పలువురు సర్పంచ్‌లు హర్షం వ్యక్తం చేశారు.

ఆఫ్‌లైన్‌లో ధాన్యం తోలిన రైతులకు సాయం



సాయం అందజేస్తున్న పీఏసీఎస్ చైర్‌పర్సన్ పాలడుగు సత్యనారాయణ

ముదునూరు(ఉయ్యూరు), జనవరి 7 : ముదునూరులో గతేడాది ఆఫ్‌లైన్‌లో ధాన్యం తోలి ఆన్‌లైన్ కాక నష్టపోయిన రైతులకు సాయం అందిస్తానన్న ఎమ్మెల్యే కేపీ సారథి హామీ మేరకు బస్తాకు రూ. 50 చొప్పున పీఏసీఎస్ చైర్‌పర్సన్ పాలడుగు సత్యనారాయణ ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముదునూరుకు చెందిన రైతులు గత ఖరీఫ్ సీజన్‌లో వివిధ కారాణాల వల్ల ఆఫ్‌లైన్‌లో తోలిన ధాన్యం ఆన్‌లైన్ కాక నష్టపోయిన సందర్భంలో బస్తాకు రూ. 50 చొప్పున తానే సాయం అందజేస్తానని ఎమ్మెల్యే వాగ్దానం చేసిన మేర 112 మంది రైతులకు రూ. 5.19లక్షలు తన సొంత నిధుల నుంచి ఇవ్వగా ముందుగా ఎస్సీ, బీసీ వర్గాలకు చెందిన రైతులకు అందజేస్తున్నామన్నారు. సర్పంచ్ మొవ్వ నాగలక్ష్మి, జ్ఞానశేఖర్, దాసే రవి, పల్లపోతు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో లయనిజమే స్ఫూర్తి

హనుమాన్‌జంక్షన్, జనవరి 7: సామాజిక అవసరాలను గుర్తించి ప్రజలకు సేవలు అందించే లయనిజంను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని మాజీ జిల్లా లయన్స్ గవర్నర్ వీరమాచనేని రామబ్రహ్మం అన్నారు. ఆదివారం స్థానిక లయన్స్ క్లబ్‌లో రామబ్రహ్మం తన భార్య సుశీల జ్ఞాపకార్థం వివిధ పాఠశాల అభివృద్ధికి రూ.15వేలు విరాళాలు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు చలసాని వెంకటేశ్వరరావు, నందిగం స్వామి, అక్కినేని రాఘవేంద్రరావు, నారాయణరావు, యలమంచిలి రవి, రత్నశేఖర్, ఆకుల వెంకటరమణ, మరీదు వెంకటస్వామి పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనానికి నిప్పు

హనుమాన్‌జంక్షన్, జనవరి 7: మద్యం మత్తులో బజ్జీలు బండ్ల అద్దాలు ధ్వంసం చేయడంతో పాటు ద్విచక్ర వాహనానికి నిప్పుపెట్టిన ఘటన శనివారం అర్ధరాత్రి స్థానిక నూజివీడు రోడ్డులో చోటు చేసుకుంది. శేరీనరసన్నపాలెంకు చెందిన గెడ్డం బాజీ నూజివీడు రోడ్డులో తోపుడు బండ్లపై బజ్జీలు, చికెన్ పకోడి వేసుకుంటు జీవనం సాగిస్తున్నాడు. బాపులపాడుకు చెందిన పుసుపులేటి సందీప్ బజ్జీలు వేసే ఆయిల్ విషయంలో బాజీతో ఘర్షణ పడ్డాడు. ఈ నేపథ్యంలో దుకాణం మూసివేసి ఇంటికి వెళ్లిపోయిన తరువాత అర్ధరాత్రి సమయంలో సందీప్ తోపుడు బండ్ల అద్దాలు పగల కొట్టి, ద్విచక్రవాహనానికి నిప్పు పెట్టాడు.

రైతు సంక్షేమమే టీడీపీ లక్ష్యం

గన్నవరం ఇన్‌చార్జి యార్లగడ్డ



యార్లగడ్డ వెంకట్రావుకు నిమ్మకాయల గజమాలతో స్వాగతం పలుకుతున్న మడిచర్ల వాసులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 7 : రైతు సంక్షేమమే లక్ష్యంగా టీడీపీ పనిచేస్తుందని గన్నవరం ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. మడిచర్ల టీడీపీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి నిర్వహించిన బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మడిచర్లలో యార్లగడ్డ వెంకట్రావుకు రైతులు ట్రాక్టర్ల ర్యాలీతో, నిమ్మకాయల గజమాలతో ఘనస్వాగతం పలికారు. గుర్రపుబండిపై యార్లగడ్డను ఊరేగించారు. ప్రత్యేకం గా నిప్పులతో తయారు చేసిన వైవీఆర్ టీడీపీ శ్రేణు ల్లో జోష్ నింపింది. అర్ధరాత్రి వరకూ యార్లగడ్డ రాక కోసం గ్రామస్తులు వేచి చూచి హారతులతో స్వాగతం పలికారు. ఆయిల్‌పామ్, డ్రిప్ ఇరిగేషన్ లాంటి వాటిని ప్రోత్సహించే విధంగా టీడీపీ హయాంలో ఇచ్చిన ప్రోత్సాహకాలను ఇంతవరకూ ఇవ్వలేదని కొందరు రైతులు యార్లగడ్డ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పుట్టా సురేష్, భూక్యా రంగారావు, దేవినేని సత్య నారాయణ, మోటూరి శ్రీనివాస్, కూకటి దుర్గారావు, భూక్యా దావీదు, తానంకి ఇజ్రాయేలు, కాలి శ్రీధర్, తెనాలి జోజిబాబు, కాలి రాజేష్, గోపి, గొరిపర్తి నాగరాజు, కంపసాటి బాలయేసు పాల్గొన్నారు.

గండిగుంటలో..

గండిగుంట(ఉయ్యూరు) : రాష్ట్రంలో మహిళలకు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు మినీ మేనిఫెస్టోలో ప్రకటించిన సంక్షేమ పథకాలు మహిళాశక్తి, తల్లికి వందనం మహిళల ఆత్మగౌరవాన్ని పెంపొందిస్తాయని పార్టీ అధికార ప్రతినిధి కొండా ప్రవీణ్ అన్నారు. గండిగుంటలో ఆదివారం పర్యటించి, బాబూ ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలు పంపిణీ చేశారు. నియోజకవర్గ మహిళా ఉపాధ్యక్షురాలు రత్నవేణి, సాయి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

పెనమలూరు : టీడీపీ అధినేత చంద్రబాబుకు అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలాంటివని టీడీపీ నాయకులు శొంఠి శివరాంప్రసాద్, మొక్కపాటి శ్రీనివాస్, అనంతనేని ఆజాద్ పేర్కొన్నారు. ఆదివారం యనమలకుదురులో జరిగిన బాబుష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో వారు పాల్గొని స్థానికులతో మాట్లాడారు. చంద్రబాబు ప్రకటించిన రాజమండ్రి మేనిఫెస్టోలో ఉన్న పథకాలను వివరించారు. వీరంకి కుటుంబరావు, ఇబ్రహీం, బలగం కొండ, ఆరేపల్లి వెంకటేశ్వరరావు, పండల రజిని, మల్లంపాటి విజయలక్ష్మి, సయ్యద్ షాహీనా, తుమ్మల రామకిషోర్, బూక్య రాజా, తాడిశెట్టి వీరాస్వామి, తమ్ము అశోక్, బలగం నాగరాజు, కళ్యాణపు శ్రీనివాస్, వెలగపూడి శేఖర్, మాచిన శివ, సీడీ ప్రసాద్, బాణావతి విజయ్ పాల్గొన్నారు.



యనమలకుదురులో జరిగిన కార్యక్రమంలో శొంఠి శివరాంప్రసాద్, మొక్కపాటి శ్రీనివాస్

యార్లగడ్డ చండీయాగం

గన్నవరం, జనవరి 7 : టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా కావటంతో పాటు ప్రజా శ్రేయస్సును కాంక్షిస్తూ పట్టణంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు, జ్ఞానేశ్వరి దంపతులు చండీయాగం, సుందరాకాండ పారాయణం, సూర్యనమస్కారాలు ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. 10వ తేదీ వరకూ జరగనున్న ఈ పూజా కార్యక్రమాలు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ సాయంత్రం నాలుగు నుంచి రాత్రి 8 వరకూ చండీ హోమాలు, చితుర్వేద స్వస్తి జరుగుతాయని తెలిపారు. టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పాలఫ్యాక్టరీ ఫీడ్‌కు ప్రశంసాపత్రం

చిట్టినగర్, జనవరి 7 : విజయవాడలోని కృష్ణాజిల్లా పాల ఉత్పత్తిదారులు పరస్పర సహకార సంఘం ఆధ్వర్యంలోని మిల్క్‌ఫ్యాక్టరీలో ఉత్పత్తి చేస్తున్న ఫీడ్‌కు వరుసగా మూడో ఏడాది భారతీయ ప్రమాణికాల సంస్థ ప్రసంశాపత్రం అందజేసింది. ఫ్యాక్టరీ నుంచి పంపిస్తున్న ఫీడ్ నమూనాలు తిరస్కరణకు గురి కాకుండా నాణ్యతా ప్రమాణాలలో దీటుగా నిలిచాయి. అత్యున్నత ప్రమాణికాలను పాటిస్తూ నాణ్యమైన ఫీడ్‌ను పాడి రైతులకు అందజేస్తున్నారు. ఈ సందర్భంగా కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ, నాణ్యమైన పశుదాణాను తయారీ వ్యయం కంటే తక్కువ ధరకే అందజేస్తున్నట్లు తెలిపారు. తమ సంస్థ అహర్నిశలు పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తుందని తెలిపారు.

సంక్రాంతి వేడుకలు సంతోషంగా జరుపుకోవాలి

కంకిపాడు మాజీ ఎంపీపీ దేవినేని రాజా



సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న మాజీ ఎంపీపీ దేవినేని రాజా, బిల్డర్ బొబ్బా గోపాలకృష్ణ,

గోసాల (కంకిపాడు), జనవరి 7 : సంక్రాంతి వేడుకలను కుల మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సంతోషంగా జరుపుకోవాలని కంకిపాడు మాజీ ఎంపీపీ దేవినేని రాజా అన్నారు. పెనమలూరు మండలంలోని గోసాల గ్రామ పరిధిలో ఆదిత్య విహారిలో ఆదివారం సంక్రాంతి సంబరాలను అత్యంత వైభవంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన దేవినేని రాజా మాట్లాడుతూ, రైతుల పండించిన పంటను విక్రయించి చేతికొచ్చిన సొమ్ముతో ఎంతో ఘనంగా ఈ వేడుకలను జరుపుకుంటారన్నారు. ఆదిత్య విహారిలో ముందస్తుగానే సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకోవడం జరిగిందని తెలియజేశారు. బొమ్మరిల్లు, గంగి రెద్దుల ఆట, హరిదాసులు, మహి ళలు ఏర్పాటు చేసిన ఆటల పోటీలు, ముగ్గుల పోటీలను నిర్వహించారు. గెలు పొందిన విజేతలకు దేవినేని రాజా బహుమతులు అందజేశారు. ఆదిత్య విహారి అసోసియేషన్ అధ్యక్షుడు నందమూరి మాధవ ఆధ్వర్యంలో జరిగిన ఈ సంబరాల్లో బిల్డర్ బొబ్బా గోపాలకృష్ణ అసోసియేషన్ కార్యవర్గం నవీన్‌కృష్ణ, రామశిద్ధేశ్వరరావు, యమున, శ్రీనివాస్ శిరీష, వంశీకృష్ణ పాల్గొన్నారు.

● టీడీపీ ఒక్కటే నాయకులు, కార్యర్తలను ఓ కుటుంబంలా భావిస్తోందని మాజీ జెడ్పీటీసీ సభ్యులు గొంది శివరామకృష్ణ ప్రసాద్ అన్నారు. కంకిపాడు మండల పార్టీ ఉపాధ్యక్షులు పులి శ్రీనివాసరావు జన్మదిన వేడుకలను పార్టీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం ఒకటవ తూము వద్ద రోడ్డుపై నివసించే పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవినేని రాజా, నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, సుదిమళ్ల రవీంద్ర బొప్పూడి శివరామకృష్ణ, కొండా నాగేశ్వరరావు, జరుగు శ్రీనివాసరావు, డీఎస్‌ఆర్ పాల్గొన్నారు.

తెలుగు ప్రజలకు దేవుడిచ్చిన గొప్ప వరం బ్రదర్ జోసఫ్ తంబి

ఉంగుటూరు, జనవరి 7 : ఎన్నో అద్భుతాల ద్వారా బ్రదర్ జోసఫ్ తంబి అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని, ఆ మహనీయుడు తెలుగు ప్రజలకు దేవుడొసగిన గొప్ప వరమని పలువురు గురువులు తమ ప్రసంగాలలో కొనియాడారు. పెదఅవుటపల్లిలో బ్రదర్ జోసఫ్ తంబి వర్ధంతి మహోత్సవాలను పురస్కరించుకుని క్షేత్రం రెక్టర్ రెవ.ఫాదర్ పాలడుగు జోసఫ్ ఆధ్వర్యంలో జరుగుతున్న నవదిన ప్రార్థనలు ఆదివారం నాలుగవ రోజుకు చేరుకున్నాయి. విజయవాడ మేత్రాసనం గురువులు జాన్‌పీటర్, గన్నవరం విచారణ గురువులు రెవ.ఫాదర్ పసల థామస్ లు దివ్యపూజాబలిని సమర్పించి, కతోలిక శ్రీసభ కొరకు ప్రత్యేకంగా ప్రార్థనలు చేశారు. అనంతరం శ్రీసభ-క్రైస్తవుల సమూహ ప్రయాణం అను అంశంపై ప్రసంగించారు. ఫాదర్లు పాలడుగు జోసఫ్, గోపు అభిలాష్, గోపు ప్రవీణ్, మద్దాల రవి, కచ్చా కిషోర్, దిరిశం జయప్రసాద్, సంఘుస్తులు, విశ్వాసులు, భక్తులు, కన్యాస్త్రీలు పాల్గొన్నారు.

టీడీపీ నేత సాంబశివరావు కుటుంబానికి ఉమా పరామర్శ



జి.కొండూరు, జనవరి 7: గడ్డమణుగు గ్రామ టీడీపీ మాజీ అధ్యక్షుడు గుజ్జర్లపూడి సాంబ శివరావు మాతృమూర్తి వెంకటరమణమ్మ ఇటీవల కన్నుమూశారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి దేవినేని ఉమా ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాంబశివరావును, ఆయన సోదరుడు శివనాగేశ్వరరావుతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

దివ్యాంగులను ప్రతి ఒక్కరూ ఆదరించాలి

గన్నవరం, జనవరి 7 : దివ్యాంగులను ప్రతి ఒక్కరూ ఆదరించాల్సిన అవసరం ఉందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. దావాజీగూడెం హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న స్పందన మానసిక వికాస కేంద్రంలోని దివ్యాంగులకు రైతు సంఘం జిల్లా నాయకులు ముక్కామల ఉమామహేశ్వరరావు కుమారుడు వెంకట లక్ష్మీశ్రీనివాస్ 15వ వర్ధంతి సందర్భంగా ఆదివారం దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అక్కినేని వనజ మాట్లాడుతూ, పేదలకు సేవ చేయటం అభినందనీయమన్నారు. డీఎస్పీ మురళీకృష్ణ, సీపీఐ ఏరియా కార్యదర్శి పెద్దు వాసుదేవరావు, కాట్రగడ్డ రామచంద్రజోషి, సొసైటీ చైర్మన్ సంకాబత్తుల వెంకట్, సెక్రటరీ ఎస్.రజిత తదితరులు పాల్గొన్నారు.

అపూర్వంగా వీకేఆర్ విద్యార్థుల సమ్మేళనం



ఆనాటి అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు

గన్నవరం, జనవరి 7 : వీకేఆర్ కళాశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం అపూర్వంగా ఆదివారం జరిగింది. కళాశాల మొదటి బ్యాచ్ నుంచి ఇప్పటి వరకూ చదువుకున్న విద్యార్థులు వివిధ ప్రాంతాల నుంచి వచ్చారు. స్నేహమేర జీవితం.. వీకేఆర్ కుటుంబం శాశ్వతం అంటూ తమలోని ప్రేమను చాటుకున్నారు. మన కలయిక అపూర్వం అంటూ నాటి తీపి జ్ఞాపకాలను నెమర వేసుకున్నారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఆప్యాయత అనురాగాన్ని చాటుతూ యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఎంతో ఆనందం ఉత్సాహంగా గడిపారు. తొలుత కళాశాల వ్యవస్థాపకులు వేములపల్లి కోదండ రామయ్య, లక్ష్మీ అన్నపూర్ణ, తొలి ప్రిన్సిపాల్ తాతినేని శ్రీని వాసరావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. పూర్వ విద్యార్థుల కమిటీ అధ్యక్ష కార్యదర్శులు మూల్పూరి వెంకట లక్ష్మీ ప్రసాద్, నాదెండ్ల బాల మురళీకృష్ణలు స్వాగతోపన్యాసం చేశారు. రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.స్వర్ణకుమారి, రిటైర్డ్ అధ్యాపకులు గన్నె వెంకట్రావు, మద్దుకూరి విజయకుమార్, డీవీ సుబ్బారావు, గాంధీబాబు కళాశాల ఉన్నతిని కొనియాడారు. కమిటీ గౌరవ అధ్యక్షులు టీఎస్ఆర్‌కె ప్రసాద్, ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు, కమిటీ కోశాధికారి రాంబాబు, సభ్యులు కొత్తంగి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ జంక్షన్‌లో..

హనుమాన్‌జంక్షన్ : ఏలూరు సీఆర్ రెడ్డి కళాశాల 1987-89 బీఎస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం స్థానిక నూజివీడు రోడ్డులోని ఓ ఫంక్షన్ హాలులో ఉత్సాహంగా నిర్వహించారు. 33 ఏళ్ల తరు వాత తొలిసారిగా కలుసుకున్న మిత్రులంతా ఒకరినొకరు పరిచయం చేసుకొని ఆనాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. కార్యక్రమాన్ని ఆ బ్యాచ్ పూర్వ విద్యా ర్థులు అట్లూరి రాజశేఖర్, కేతినీడి ధర్మేంద్ర, సాంబ, సత్తిబాబు, డాక్టర్ కోటగిరి శ్రీకాంత్, తదితరులు పర్యవేక్షించారు.

విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం

ఉయ్యూరు : ఒక సంస్థలో పనిచేసి ఉద్యోగ విరమణ అనంతరం ఎక్కడెక్కడో నివసిస్తున్న అందరూ కలసి ఆహ్లాదకరంగా ఆత్మీయ సమ్మేళనం జరుపుకోవడం సంతోషకరమని ప్రముఖ వైద్యుడు చలమలశెట్టి శివరామకృష్ణారావు అన్నారు. స్థానిక శరత్ నర్సింగ్ హోమ్ ఆవరణలో ఆదివారం జరిగిన కేసీపీ షుగర్స్ ఉయ్యూరు యూనిట్ వ్యవసాయ విభాగం విశ్రాంత ఉద్యోగుల తృతీయ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 75 సంవత్సరాలు వయస్సు దాటిన చలమలశెట్టి వీర కోటేశ్వరరావు, మేరుగ సత్యనారాయణ, వడ్డే బాలాజీ, కోడె సాంబశివరావు, చింతా కోటేశ్వరరావు, కర్లపూడి శ్రీరాములు, శివరామకృష్ణారావును సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	85, 92, 102
చికెన్ విత్ స్కిన్	164
చికెన్ స్కిన్‌లెస్	174

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.65

చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసిన వెనిగండ్ల



గుడివాడ : తిరువూరులో జరిగిన రా... కదిలిరా బహిరంగసభకు విచ్చేసిన టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడును గుడివాడ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు.

ఎస్మా ఉపసంహరించుకోకుంటే తిరుగుబాటే

అంగన్వాడీ కార్యకర్తల సంఘం ప్రతినిధులు రమాదేవి, రిజియా రాణి హెచ్చరిక



27వ రోజు రిలే నిరాహారదీక్షలో అంగన్వాడీ కార్యకర్తల సంఘం ప్రతినిధులు ఎ.రమాదేవి, రిజియారాణి

మచిలీపట్నం టౌన్, జనవరి 7 : ఎస్మా ప్రయోగిస్తే తిరగబడతామని అంగన్వాడీ కార్యకర్తల సంఘం ప్రతినిధులు ఎ.రమాదేవి, రిజియారాణి పేర్కొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తల ఆందోళన శనివారం నాటికి 27 వ రోజుకు చేరుకుంది. బందరులో జరిగిన రిలే నిరాహార దీక్షల్లో వివిధ మండలాల అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. కార్మిక సంఘాల నాయకులు, జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు తదితరులు తమ సంఘీభావం తెలిపారు.

పామర్రు : ఎస్మా ప్రయోగం కార్మికుల హక్కులను హరించడమేనని అం గన్వాడీ సంఘం అధ్యక్షురాలు ఉమారాణి అన్నారు. ప్రభుత్వం మొండిగా వ్యహరిస్తే తిరగబడతామని హెచ్చరించారు. టీడీపీ నేత మంతెన రామాంజనేయులు, దాలిపర్తి ప్రసాద్, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బాబురాజేంద్ర ప్రసాద్, భానుప్రకాష్ తదితరులు సంఘీభావం తెలిపారు. కైలే రత్నశ్రీ, బొమ్మారెడ్డి పద్మ, వాణి, ఒడుగు గంగాధర్, ఎం.విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల : ఎస్మా చట్టాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు బొకినాల కృష్ణ డిమాండ్ చేశారు. గత 27 రోజులుగా సమస్యల పరిష్కారం కోసమే పోరాటం చేస్తున్న అంగన్వాడీలకు ఆయన సంఘీభావం తెలిపారు.

అవనిగడ్డ : అంగన్వాడీలపై ప్రభుత్వం ఎస్మా చట్టం ప్రయోగించటం దుర్మార్గమైన చర్య అని జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు అన్నారు. అవనిగడ్డలో ఆయన మాట్లాడుతూ, సమస్యలు పరిష్కరించకపోగా ఎస్మా చట్టాన్ని ప్రయోగించి హక్కులకు భంగం కలిగించటం బాధాకరమన్నారు. అంగన్వాడీల పక్షాన పోరా టం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

కోడూరు : అంగన్వాడీలపై ఎస్మా విధించడాన్ని ఉమ్మడి కృష్ణాజిల్లా జనసేన పార్టీ కార్యదర్శి కొండవీటి సునీత ఖండించారు. నెల రోజుల నుంచి మహిళలు రోడ్డు మీదకు వచ్చి అనేక విధాలుగా నిరసనలు తెలిపినా ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించకపోవటం సరైన పద్ధతి కాదన్నారు. తక్షణమే ఎస్మా చట్టాన్ని వెనక్కి తీసుకుని న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు.

కొట్టె వెంకట్రావుకు ఉత్తమ రైతు అవార్డు



మచిలీపట్నం టౌన్ : చౌడుభూముల్లో ఏడాది అంతా పంటలు పండించిన జనసేన నాయకుడు, మాజీ కౌన్సిలర్ కొట్టె వెంకట్రావుకు ఉత్తమ రైతు అవార్డు లభించింది. రాజమండ్రి ఐఎస్‌టీఎస్ ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన సంక్రాంతి సంబరాలలో ఈ అవార్డును అందజేశారు. బందరు మండలం కొత్తపూడి గ్రామంలోని వ్యవసాయ భూమిలో బోరు వేసి ఉద్యానవన పంటలు పండించిన వెంకట్రావును జేఎన్‌టీయూ డైరెక్టర్ రామిరెడ్డి, ఐఎస్‌టీఎస్ ఉమె న్స్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ ఉపేందర్‌రెడ్డి సత్కరించారు. వెంకట్రావుకు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు అభినందనలు తెలిపారు.

విజయ దాణాకు ఐఎస్ఐ ప్రశంసాపత్రం

విజయవాడ : కృష్ణా జిల్లా పాల ఉత్పత్తిదారులు పరస్పర సహకార సంఘం ఆధ్వర్యంలోని మిల్క్ ఫ్యాక్టరీ ఉత్పత్తి చేస్తున్న విజయ పశువుల దాణాకు వరుసగా మూడో ఏడాది ఐఎస్ఐ ప్రశంసా పత్రం లభించింది. అత్యున్నత ప్రమాణాలను పాటిస్తూ నాణ్యమైన పశుదాణాను తక్కువ ధరకే పాడి రైతులకు అందజేస్తున్నామని కృష్ణా మిల్క్‌యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు తెలిపారు. తమ సంస్థ అహర్నిశలు పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. వినియోగదారులకు నాణ్యమైన పాల ఉత్పత్తులను అందిస్తోందన్నారు.



న్యాయవాదుల నిరసన ప్రదర్శన

మచిలీపట్నం టౌన్ : భూ హక్కు చట్టాన్ని నిషేధించాలంటూ ఆదివారం జిల్లా కోర్టు వద్ద న్యాయవాదులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. లంకిశెట్టి బాలాజీ తదితరులు పాల్గొని ప్రభుత్వ మొండివైఖరిని తీవ్రంగా ఖండించారు. కమ్మిలి విజయకుమార్, కొట్టె రఘురాం, అడపా మురళీ, వన్నెంరెడ్డి శ్రీనివాస్, గరిమెళ్ళ ప్రభాకర్, తాతా గోపీ, రెడ్రౌతు రమణ, జొన్నల నాగరాజు, వంకా శరణ్య, అల్లాడ లావణ్య, సువర్ణరాజు, కె. రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

19వ రోజుకు సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

మచిలీపట్నం టౌన్ : జీతాలు పెంచాలంటూ సమగ్ర శిక్ష ఉద్యోగులు నిర్వహిస్తున్న సమ్మె ఆదివారం నాటికి 19వ రోజుకు చేరింది. ఆదివారం జరిగిన రిలే నిరాహార దీక్షా శిబిరంలో సంఘం నాయకుడు పోతురాజు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం బలవంతంగా విధుల్లోకి చేర్పించేందుకు యోచిస్తోందన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. ఎన్నికల ముందు తెలంగాణా రాష్ట్రం కంటే వెయ్యి రూపాయలు అదనంగా జీతం పెంచుతానని సీఎం జగన్మోహన రెడ్డి వాగ్దానం చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

అవనిగడ్డ - కోడూరు రహదారి నిర్మాణం చేపట్టాలి : జనసేన

అవనిగడ్డ : అవనిగడ్డ - కోడూరు రహదారి అధ్వాన్నంగా ఉండటం కారణంగానే ప్రమాదాల్లో ప్రజలు బలైపోతున్నారని జనసేన పార్టీ మండల అధ్యక్షులు గుడివాక శేషుబాబు అన్నారు. అవనిగడ్డలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే ఇచ్చిన మాటలు ఎప్పుడో గాలిలో కలిసిపోయాయన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రహదారి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. సెక్షన్ 22ఏ నిషేధిత భూముల జాబితా నుంచి అనాధీన భూములను తొలగించకుంటే ఉద్యమ బాట పట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎంపీటీసీ సభ్యుడు బొప్పన భాను, పప్పుశెట్టి శ్రీను, ఆకుశెట్టి రవి, గుడివాక రామాంజనేయులు, తోట అంజనేయులు, జొన్నాదుల మోహన్, వార్డుసభ్యులు అడపా ప్రభాకర్, కమ్మిలి సాయిభార్గవ, తుంగల నరేష్, బొంతు ప్రకాష్, నలిగిలి రాజేష్, ఫరీద్, రేపల్లె లక్ష్మణ, పవన్ కళ్యాణ్, రేపల్లె రోహిత్ పాల్గొన్నారు

తీయని బంధం గ్రంథావిష్కరణ



గుడివాడ : వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థానంలో విశ్వకర్మ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్యక్షుడు బసవేశ్వరరావు అధ్యక్షతన వసుధ బసవేశ్వరరావు రచించిన తీయని బంధం గ్రంథాన్ని ఆవిష్కరించారు. సం ఘం జిల్లా అధ్యక్షులు చింతలూరి సత్యనారాయణ మాట్లాడుతూ సంక్షేమ కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. సంఘం కార్యదర్శిగా పి.బి.ఎస్.వి ప్రసాద్‌ను ఎన్నుకున్నారు. డాక్టర్ శ్రీనుబాబు, పి.ప్రసాద్, విశ్రాంత ఉపాధ్యాయులు వి.వీరరాఘవాచారి, కృష్ణకిషోర్, రాజారావు పాల్గొన్నారు.

కొమ్మినేని మాస్టారుకు జాతీయ స్థాయి పురస్కారం



నాగాయలంక : నాగాయలంక జడ్పీ పాఠశాల జువాలజీ ఉపాధ్యాయుడు కొమ్మినేని ఉదయకుమార్ జెమ్ ఆఫ్ ఇండియా జాతీయ అవార్డును న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ నేత డాక్టర్ విజయ్ జోలి చేతుల మీదుగా అందుకున్నారు. పాఠశాల విద్యార్థులను రాష్ట్ర, జాతీయ స్థాయి సైన్స్ పోటీలలో విజేతలుగా నిలిపినందుకు, ప్రేరణ, స్ఫూర్తి వంటి సామాజిక కార్యక్రమాల్లో విద్యార్థులను భాగస్వామ్యం చేసినందుకు అవార్డు వచ్చిందని ఎంఈవో-2 అన్నపరెడ్డి రామారావు తెలిపారు. జాతీయ స్థాయి పురస్కారం అందుకున్నందుకు, గ్రామ, మం డల స్థాయి ప్రజాప్రతినిధులు, పాఠశాల విద్యా కుటుంబం ఆయనను అభినందించారు.



బాలుర హాకీ జిల్లా జట్టు ఎంపిక

మచిలీపట్నం టౌన్ : కృష్ణాజిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నోబుల్ కళాశాల క్రీడా మైదానంలో జిల్లా జూనియర్ బాలుర హాకీ జట్టును ఎంపిక చేశారు. హాకీ అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ శ్రవణం రామకృష్ణ, జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు సన్నిధి నాగసాయి శ్రీనివాస్, కార్యదర్శి శ్రవణం హరికృష్ణ, కోశాధికారి విఠల్, అసోసియేషన్ సభ్యుడు ఆత్మారి వెంకట సుబ్బారావులు పాల్గొన్నారు. ఈ జట్టు ఈనెల 9న జరిగే రాష్ట్ర స్థాయి హాకీ చాంపియన్ పోటీల్లో పాల్గొంటుందన్నారు.

కళాకారులకు ఆదర్శప్రాయుడు కొక్కిలిగడ్డ

నాగాయలంక : నాటకాలను ఎంతో మందికి నేర్పటంతోపాటు ప్రదర్శించి ప్రజల అభిమానం చూరగొన్న కొక్కిలిగడ్డ పాండురంగారావు నేటితరం నాటక రంగ కళాకారులకు ఆదర్శం అని అగ్నికుల క్షత్రియుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బర్రి ప్రసాద్ అన్నారు. ఏపీ అగ్నికుల క్షత్రియుల సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి లకనం నాగాంజనేయులు అధ్యక్షతన జరిగిన పాండురంగారావు సంస్మరణ సభలో తుంగల కోటేశ్వరరావు మెండు లక్ష్మణరావు, కె.శివానందరావు, నాగిడి తాతారావు, కమతం నాంచారయ్య, తిరుమలశెట్టి మస్తానరావు, వివిధ సంఘాల నాయకులు ఒడుగు లక్ష్మీనారాయణ, పీత రమేష్, చెన్ను గురుమూర్తి, కళాకారులు పాల్గొన్నారు.



గుడివాడ టౌన్ హైస్కూల్ 1999-2000 బ్యాచ్ పూర్వవిద్యార్థులు



ప్రభుత్వ డిగ్రీ కళాశాల 1988 - 91 బీకాం విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

గుడివాడ : అడుసుమిల్లి రామకృష్ణయ్య ఉన్నత పాఠశాల (టౌన్ హైస్కూల్) 1999-2000 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం సందడిగా జరిగింది. పరస్పరం మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. నాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు ఎస్ఎస్‌వీఆర్, శ్రీనివాసరావు, ముక్తేశ్వర రావు, చిన్న వెంకట్రావు తదితరులను ఘనంగా సన్మానించారు. **అవనిగడ్డ :** ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1988 - 91 బీకాం విద్యార్థుల సమ్మేళనం ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది. ఎన్.వి.ఎస్.పూర్ణచంద్రరావు అధ్యక్షతన సమావేశమై మధుర జ్ఞాపకాలను పంచుకున్నారు.

దిగువ భూములకు సాగునీరు అందించాలి

కోడూరు : మండలలోని దిగువ ప్రాంతం రామకృష్ణాపురం శివారు భూములకు సాగునీరు అందించాలని జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు మండలి వెంకట్రామ్ డిమాండ్ చేశారు. రామకృష్ణాపురం గ్రామ సమీపంలో నీరు లేక ఎండుతున్న పంట పొలాలను పార్టీ నేతలతో కలసి ఆయన పరిశీలించారు. ఎమ్మెల్యే కల్లబొల్లి కబుర్లు చెప్పటం మానేసి సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. మండల టీడీపీ అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు, రైతు సంఘం నాయకులు ఆవుల బసవయ్య, దేవనబోయిన వెంకటేశ్వరరావు, అద్దంకి పాండురంగారావు, గోగినేని సోమశేఖరరావు, దావు మల్లి తదిరతులు పాల్గొన్నారు.

రేపటి నుంచి 18 వరకు జన భగీరథ కార్యక్రమాలు : కలెక్టర్

మచిలీపట్నం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : స్మృతివనంలో ఈనెల 19న అంబేడ్కర్ విగ్రహావిష్కరణను పురస్కరించుకుని ఈనెల 9వ తేదీ నుంచి 18వ తేదీ వరకు జన భగీరథ కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రాజాబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కో గ్రామం నుంచి కనీసం ఐదుగురిని అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలన్నారు. సామాజిక న్యాయంపై అవగాహన సదస్సులు, విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వకృత్వపోటీలు నిర్వహించడంతో పాటు, రక్తదాన శిబిరాలు, మానవహారాలు ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావాలి : విక్టర్ ప్రసాద్

భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనంలో ఈనెల 19న జరిగే అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహావిష్కరణ కార్యక్రమం ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావాలి రాష్ట్ర ఎస్సీ కమీషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ కోరారు. అర్ అండ్ బీ అతిధి గృహంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

కబ్జాకు గురైన దేవాలయాల భూములకు విముక్తి కల్పిస్తాం : శివస్వామి



గుడివాడ : రాష్ట్రవ్యాప్తంగా అన్యాక్రాంతమైన దేవాలయ భూములను కబ్జాదారుల చెర నుంచి విముక్తి కల్పించి తిరిగి దేవాలయాలకు చెందేలా చేస్తామని అమరావతి శివక్షేత్రం పీఠాధిపతి శివస్వామి స్పష్టం చేశారు. తాళ్ళూరి కల్యాణమండపంలో ఆజాద్ హిందూ బోర్డు, వాసవి ఇంటర్నేషనల్ పరివార్ ఆధ్వర్యంలో కూరెళ్ల శ్యామ్‌సుందర్, జగత్ పర్యవేక్షణలో నిర్వహించిన హిందూ ఆత్మీయ సమ్మేళనానికి స్వామిజీ ముఖ్య అతిథిగా విచ్చేశారు. రాష్ట్రవ్యాప్తంగా దేవదాయ, ధర్మాదాయ శాఖకు సుమారు 4 లక్షల ఎకరాల భూమి ఉందని, లక్ష ఎకరాల మేర భూములు కబ్జాకు గురైనట్లు గుర్తించామన్నారు. 150 మంది న్యాయవాదులతో ఆజాద్ హిం దూ బోర్డును ఏర్పాటు చేశామని, దేవాలయ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా, కబ్జాలో ఉన్న భూముల విడుదలకు కృషి చేస్తామన్నారు. కుల, వర్ణ, ప్రాంత, ధనిక భేదాలు లేకుండా హిందువులందరూ ఐక్యంగా ఉండాలని ఆకాంక్షించారు. శ్రీకృష్ణయాచర్య స్వామి, రుద్ర యోగీశ్వరానందస్వామి, భవాని శంకరానందస్వామి, చీకోటి ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.



38వ డివిజన్‌లో పర్యటిస్తున్న మాజీ మంత్రి కొల్లు రవీంద్ర సతీమణి కొల్లు నీలిమ



వెనిగండ్ల సమక్షంలో టీడీపీలో చేరుతున్న ప్రజలు

చంద్రబాబును సీఎంను చేస్తేనే రాష్ట్రానికి మేలు : నీలిమ

మచిలీపట్నం టౌన్, జనవరి 7 : విజన్ ఉన్న చంద్రబాబునాయుడు తిరిగి అధికారంలోకి వస్తేనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర సతీమని కొల్లు నీలిమ అన్నారు. ఆదివారం 38వ డివిజన్ గొడుగుపేటలో బాబుష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో కొల్లు నీలిమ పాల్గొన్నారు. చంద్రబాబు పేర్కొన్న సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. టీడీపీ కార్పొరేటర్ అన్న ఆనంద్, టీడీపీ నాయకులు యశ్వంత్ వర్మ, శివకోటి రాజేంద్రప్రసాద్, తమ్మన హేమకుసుమ, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. మాజీ కౌన్సిలర్ బాజానీ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. చిలకలపూడిలో బాబు షూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. మచిలీపట్నం నగర టీడీపీ అధ్యక్షుడు ఎండి ఇలియాస్ పాషా, రామగాని రత్నారావు, రామగాని లోకేష్, ఉయ్యూరు వరప్రసాద్, మిద్దే వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. **అవనిగడ్డ :** అవనిగడ్డ నాల్గో వార్డులో బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు మండలి వెంకట్రామ్, జనసేన జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు చంద్రబాబు పథకాలు వివరించారు. **అవనిగడ్డ రూరల్ :** పులిగడ్డలోని 133, 134, 135 బూత్‌లలో బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. ఇంటింటికి తిరిగి చంద్రబాబు ప్రకటించిన ఆరు గ్యారెంటీలను ప్రజలకు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఎస్సీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి గుం టూరు వినయ్‌బాబు, బూత్ కన్వీనర్ నాగిడి రాంబాబు, బత్తుల శ్రీను తదితరులు పాల్గొన్నారు. **కోడూరు :** రామకృష్ణాపురంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని టీడీపీ శ్రేణులు నిర్వహించారు. మండల టీడీపీ అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు, కొక్కిలిగడ్డ జాన్ విల్సన్, మాజీ సర్పంచ్‌లు దేవనబోయిన వెంకటేశ్వరరావు, అద్దంకి పాండురంగారావు, గోగినేని సోమశేఖరరావు, దావు మల్లి, గోలి సాంబశివరావు, ఓలేటి రాంబాబు, పులి సుబ్బారావు, ఆరేపరపు ఆదాం, జోగయ్య, మహమ్మద్ ఇమ్రాన్, ఆరే గాంధీ, బండే వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **పెడన :** బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నియోజకవర్గంలో విజయవంతంగా జరుగుతోందని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ అన్నారు. తెలుగుదేశం, జనసేన పార్టీల సమన్వయ సమావేశం పంచకర్ల సురేష్ అధ్యక్షతన స్థానిక తోటమూల ఫంక్షన్ హాలులో ఆదివారం జరిగింది. పాశం మల్లేశ్వరరావు, కూనపరెడ్డి రంగయ్యానాయుడు, శీరం ప్రసాద్, మట్టా శివపావని, గోవర్ధనరావు, నాగబాబు, శ్రీనివాసరావు తదితర నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

70 మంది టీడీపీలో చేరిక

గుడివాడ : మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై అధికార వైసీపీకి చెందిన యువత పెద్ద ఎత్తున టీడీపీలో చేరడం అభినందనీయమని నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము అన్నారు. బైపాస్ రోడ్డులోని టిడిపి కార్యాలయంలో స్థానిక 14వ వార్డుకు చెందిన 70 మంది యువకులకు వెనిగండ్ల పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు దింట్యాల రాంబాబు పాల్గొన్నారు.



పుస్తకాలు, విద్యాసామగ్రి వితరణ

ఘంటసాల : శ్రీకాకుళం ఎస్సీ బాలికల వసతిగృహం విద్యార్థులకు జనసేన పార్టీ ఆధ్వర్యంలో నోటుబుక్స్, ప్యాడ్లు, పెన్నులు ఆదివారం అందజేశారు. వసతిగృహంలోని 35 మంది విద్యార్థులకు గాదె వెంకట దుర్గా ప్రసాద్, వెంకట సాయి అనంత్, కటారి నాగబాబు సహకారంతో భోజనాలు ఏర్పాటు చేశారు. తెలుగుయువత నాయకుడు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), వార్డెన్ పీతల జ్ఞాన సుందరి, దాసం రామకృష్ణ, కటారి నాగబాబు, గాదె వెంకటేశ్వరరావు, మేక శ్రీనివాసరావు రిచీత్, మాదాసు వినయ్, కోన హరీష్ కృష్ణ, లంక త్రినాథ్, లంకా దివాకర్, విజయ్, వెంకట పవన్, వీరబాబు, సిద్దు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు అరటి గెలలు వితరణ

మోపిదేవి : గుత్తికొండ వాసవి, రామారావు జ్ఞాపకార్థం పూర్ణచంద్రరావు దంపతులు రూ.10 వేల విలువ గల అరటి గెలలను నూజివీడు సమీపంలోని అనాథ శరణాలయానికి వితరణగా అందజేశారు. అరటి గెలలను మినీ వ్యాన్ ద్వారా నూజివీడు మండలం తోటపల్లి స్కిల్ ప్యారడైజ్‌లోని అనాథ పిల్లలకు పంపామన్నారు. ఎస్.శివబాబు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కె.కుటుంబరావు తదితరులు ఉన్నారు.

ట్రైసైకిళ్లు, వీల్‌చైర్ వితరణ

చల్లపల్లి : సేవే పరమావధిగా ఐవీఎం పనిచేయడం అభినందనీయ మని విశ్రాంత డీఎస్పీ కె.హరిరాజేంద్రబాబు అన్నారు. పురిటిగడ్డ ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్ దాతృత్వంతో నిరుపేదలకు రెండు ట్రై సైకిళ్లు, వీల్ చైర్‌లను అందజేశారు. పాగోలు, దేవరకోట, వానపాముల గ్రామాలకు చెందిన వారికి వాటిని అందించారు. పేదల అవసరాలను గుర్తించి వారికి సాయమందిస్తున్న ఐవీఎం డైరెక్టర్ డా.వేములపల్లి సురేష్‌ను విశ్రాంత డీఎస్పీ అభినందించారు. ట్రస్ట్ సభ్యులు ఎన్.ఫణి, పి.రాజేష్, జి.ప్రసాద్, మాజీ సర్పంచ్ పరుచూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మినుము పంట దగ్ధం

మోపిదేవి : కౌలురైతు నర్రావుల ప్రభాకర్‌రావు వరి పంటను యంత్రంతో కోత కోయించి మినుము పంట వేశారు. శనివారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట సర్క్యూట్‌తో వరిగడ్డి, మినుము దగ్ధమైనట్లు తెలిపారు.

సంస్కృతిని పరిరక్షించుకోవాలి

మచిలీపట్నం టౌన్ : సంస్కృతి సంప్రదాయాలకు పరిరక్షిం చుకోవాలని రూరల్ ఎస్సై పద్మ అన్నారు. హిందూ హైస్కూల్‌లో బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ముగ్గుల పోటీల విజేతలకు ఎస్సై పద్మ, న్యాయవాది అజ్మతున్నాసా బహుమతులు అందజేశారు. బ్రాహ్మణ సేవా సంఘం ఉపాధ్యక్షుడు , విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఆర్‌కే మూర్తి, సంఘ ప్రధాన కార్యదర్శి, న్యాయవాది వింజమూరి శివరాం, ఫణికుమార్, వడ్లమన్నాటి దివాకర్, సర్వా లలిత కుమారి, శ్రీకాకుళపు రేణుకారాణి, విజయశ్రీ పాల్గొన్నారు.